# 97. అప్పుడే కాదు

కష్టాలొచ్చినప్పుడు చాలామంది 'నాకే ఎందుకిలా జరగాలి?' అని భగవంతుడ్ని ప్రశ్నిస్తూ విలపిస్తారు. అలాంటివారు ఈ కథని తప్పక చదవాలి.

ఓ దంపతులు తమ మేరేజ్ సిల్వర్ జూబ్లీ ఏనివర్సరీకి షాపింగ్‌కి వెళ్ళారు. ఓ దుకాణంలో వున్న టీ కప్పుల సెట్‌ని చూసి భార్య ముచ్చటపడి చెప్పింది.

"వీటిని కొందామండి."

"అవును. ఇంత అందమైన కప్పులని నేనింతదాకా చూడలేదు." చెప్పాడు భర్త కూడా.

అకస్మాత్తుగా వాటిలోని ఓ టీ కప్పు మాట్లాడింది.

"నేను పుట్టినప్పటి నించీ ఇంత అందంగా లేను. మొదట నేను ఎర్రటి మట్టిని మాత్రమే. నా యజమాని నన్ను తీసుకువచ్చి నీళ్ళల్లో బాగా తడిపి నా గొంతు పట్టుకుని పిసకసాగాడు. 'ఒద్దొద్దు. నాకు బాధగా ఉంది' అని నేను అరిచినా 'అప్పుడే కాదు' అన్నాడు తప్ప నన్ను పిసకడం అపలేదు."

టీ కప్పు చెప్పే కథని ఆ దంపతులిద్దరూ ఆసక్తిగా వినసాగారు.

"తర్వాత నన్ను తిరిగే చక్రంలో ఉంచి గిరగిర తిప్పసాగాడు. 'ఆపు. నాకు తల తిరుగుతోంది' అని నేనరిచి గీపెట్టినా ఆ చక్రాన్ని తిప్పడం ఆపకపోగా 'అప్పుడే కాదు' అన్నాడు. ఆ తర్వాత నన్ను కొలిమిలో ఉంచాడు. ఏం వేడి? అంత వేడిని నేనెన్నడూ చూడలేదు. నన్నెందుకలా కాలుస్తున్నాడో అర్థంకాక, దాని తలుపు మీద తట్టి అరిచాను. అయినా తలుపు తీయలేదు. 'అప్పుడే కాదు' అన్నాడు.

"చివరకి తలుపు తెరచి నన్ను షెల్ఫ్‌లో పెట్టాడు. నేను పూర్తిగా చల్లబడ్డాక బ్రష్‌తో నా మీద రంగులు పులమసాగాడు. ఆ విష వాయువులతో నాకు ఊపిరి ఆడటం లేదని అరిచాను. ఎప్పటిలానే 'అప్పుడే కాదు' అన్నాడు. అంతటితో నన్ను వదులుతాడనుకున్నాను. ఊహు. తర్వాత నన్ను మళ్ళీ కొలిమిలో ఉంచాడు.

ఇది మొదటిదాని కన్నా రెట్టింపు వేడిగల ఓవెన్ అనిపించింది. భరించలేక అరిచాను. బ్రతిమాలాను. ఏడ్చాను. ఎప్పటిలానే 'అప్పుడే కాదు' అన్నాడు. నాకు ఆశ పోయింది. చావు తప్పదనుకున్నాను. 'ధైర్యంబు విలోలంబయ్యే' అనే స్థితికి చేరుకున్నాను." చిన్నగా నిట్టూర్చి మళ్ళీ చెప్పడం కొనసాగించింది ఆ టీ కప్పు.

"ఆకస్మాత్తుగా నన్ను బయటకి తీసి మళ్ళీ షెల్ఫ్‌లో ఉంచాడు. ఓ అద్దాన్ని నా ముందుంచి చెప్పాడు."

"ఇప్పుడెలా ఉన్నావో చూసుకో."

చూసాను!

"ఛ! ఇది నేను కాదు." అన్నాను.

"నువ్వే." నవ్వుతూ చెప్పాడు.

" నేనెలా అవుతాను? నేనెప్పుడూ ఇంత అందంగా లేనుగా?" అడిగాను.

"ఇది శ్రద్ధగా వినండి. అప్పుడాయన నాతో చెప్పాడు. 'గుర్తుంచుకో. నిన్ను తడిపి, పిసికి, రోల్ చేసాక నీ మాట విని నిన్ను విడిచిపెడితే నువ్వు ఎండిపోయేదానివి. నిన్ను చక్రం మీద తిప్పుతున్నప్పుడు నీ మాట విని నిన్ను వదిలేస్తే, నువ్వు చితికి పోయేదానివి. కొలిమిలో భరించలేని వేడిలో ఉన్నప్పుడు నీ మాట విని నిన్ను బయటకి తీసేస్తే, నువ్వు గట్టిపడేదానివి కావు. బద్దలయ్యేదానివి. తర్వాత విష వాయువులు నిన్ను బాధిస్తున్నాయని మధ్యలో నిన్ను కొలిమిలోంచి తీసేస్తే, ఇంత అందమైన రంగులు నీ ఒంటి మీద ఎక్కువ కాలం మన్నేవి కావు. ఇప్పుడు నువ్వు పరిపూర్ణంగా తయారయ్యావు. ఎర్రటి మట్టిగా ఉన్న నిన్ను నేను చూసినప్పుడు, నిన్ను నేను ఎలా చూడాలనుకున్నానో ఊహించాను. ఇప్పుడు నువు సరిగ్గా అలాగే తయారయ్యావు."

మనిషి జీవితం కూడా ఇంతే.

కొందరు తడప బడుతూండగా, ఇంకొందరు పిసక బడుతూండగా 'ఒద్దొద్దు' అనో, 'ఇంకాపు' అనో అరుస్తూంటారు. మరి కొందరు చక్రం మీద

తిప్పు బడుతూండగా 'ఆపాపు' అంటారు. ఇంకొందరు కొలిమిలోని వేడిని తట్టుకోలేక 'ఇంకొద్దు. నన్ను బయటకి తీసెయ్' అని రోదిస్తారు. మరి కొందరు బ్రష్‌తో పెయింట్ చేస్తున్నప్పుడో లేదా రంగులు స్థిరంగా ఉండటానికి రెండోసారి కొలిమిలో పెట్టినప్పుడో 'ఒద్దు' అని ఏడుస్తారు. అయితే ప్రతీసారి దేవుడు 'అప్పుడే కాదు' అని మనతో అంటాడు.

ఎందుకంటే, మట్టిలా ఉన్న మనల్ని చూసినప్పుడే మనని ఎలా తీర్చి దిద్దాలో ఆయనకి ఓ అవగాహన కలుగుతుంది. మనుషులకి కలిగే కష్టాలు, నష్టాలు, కన్నీళ్ళు, బాధలు మొదలైనవన్నీ దేవుడు మనిషిని పశుత్వం నించి దైవత్వం వైపు తీసుకుపోవడానికి చేసే ప్రయత్నాల్లో భాగాలే. అవన్నీ ఆయన ప్రేమ తాలూకు కానుకలే తప్ప మరోటి, ఇంకోటి కావు.

అందుకే జ్ఞానులు, 'పూర్వ జన్మలో ఎవరికో, ఏదో చేసి ఉంటాను. ఆ పాప ఫలితంగానే నాకీ జన్మలో ఈ కష్టాలు వచ్చి పడ్డాయి' అన్న జ్ఞానం వల్ల ఆ కష్టాలని అనుభవించేప్పుడు సహనంగా భరించే శక్తిని తమకి ఇవ్వమని మాత్రమే దేవుడ్ని ప్రార్థిస్తారు తప్ప తమ కష్టాలని తొలగించమని ప్రార్థించరు. సామాన్యులు మొక్కులు మొక్కడం, వ్రతాలు, తీర్థ యాత్రలు చేయడం లాంటివి చేస్తారు.

## 98. అభిమాన రచయిత

ఓ సాయంత్రం ఓ యువతి ఓ పుస్తకాల షాపుకి వెళ్ళి ఓ కొత్త రచయిత రాసిన పుస్తకాన్ని కొన్నది. మంచి పుస్తకాన్ని చదవ్వచ్చున్న ఆశతో ఆమె త్వరగా ఇంటికి చేరుకుంది. సౌకర్యంగా వున్న ఓ కుర్చీలో కూర్చుని, వేడి వేడి టీని తాగుతూ ఆమె ఆ వర్షపు సాయంత్రం ఆ పుస్తకాన్ని తెరిచింది. మొదటి పది పేజీలు చదివాక ఆమెకి ఆ నవల విసుగనిపించింది. దాన్ని మూసేసి పుస్తకాల షెల్ఫ్‌లో ఉంచి ఇక ఆ నవల గురించి ఆమె మర్చిపోయింది.

త్వరలోనే ఆమెకి ఓ యువ జర్నలిస్ట్‌తో పరిచయం అయి, క్రమంగా అది ప్రేమలోకి దారి తీసింది. ఓ ఆదివారం మధ్యాహ్నం ఆ జర్నలిస్ట్ ఆమె